ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 04-11-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

ముఖ్యాంశాలు

- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు మురాసు తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహించారు.

- మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు, మున్సిపల్ కార్పొరేషన్లలో పరోక్ష ఎన్నికల నిర్వహణకు ఎన్నికల షెడ్యూల్ ను రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా విడుదల చేశారు.

- వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్ర వ్యవసాయ రంగాన్ని ఆదుకోవాలని ముఖ్యమంత్రి.. కేంద్ర ఇంటర్ మినిస్టీరియల్ బృందానికి విజ్ఞప్తి చేశారు.

- మురాసు తుఫాను మరింత బలహీనపడి అల్పపీడన ప్రాంతంగా మారే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) పేర్కొంది.

==========

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు.. మురాసు తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహించారు. గుంటూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాల్లోని తుఫాన్ ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. చిలకలూరిపేట, ఒంగోలు, కొత్తపట్నం, చినగంజాం, చీరాల, బాపట్ల ప్రాంతాల్లో తుఫాన్ వల్ల జరిగిన నష్టాన్ని ముఖ్యమంత్రి పరిశీలించారు. వివిధ ప్రాంతాల్లో నీట మునిగిన పంటలు.. గ్రామాలను చుట్టుముట్టిన నీరు, దిగ్బంధమైన రోడ్లను చంద్రబాబు నాయుడు ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలించారు. అనంతరం ముఖ్యమంత్రి.. తుఫాను తర్వాత పరిస్థితులపై రియల్ టైమ్ గవర్నెన్స్ నుంచి అధికారులతో సమీక్ష నిర్వహించారు. తుఫాను కారణంగా కురిసిన భారీ వర్షాలకు వివిధ వాగులు, కాలువలకు వరద ప్రవాహాలు పెరిగాయని, ఎర్రకాలువ, గోనెల వాగు తదితర ప్రాంతాలకు నీటి ప్రవాహాలు వస్తున్నాయని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. కారంచేడు నుంచి కొత్తపట్నం, చీరాల, చిలకలూరిపేట, పర్చూరు ముంపు ప్రాంతాలను సాధారణ స్థితికి తెచ్చేందుకు కార్యాచరణ చేపట్టాలని సూచించారు. అలాగే.. రహదారులపై రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలని ఆయా జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు.

==========

స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో భాగంగా 87 మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు, 13 మున్సిపల్ కార్పొరేషన్లలో పరోక్ష ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఎన్నికల షెడ్యూల్ ను రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా.. ఈరోజు విడుదల చేశారు. ఈ నెల 18వ తేదీ లోగా ఎన్నికల నోటీసు జారీ కానుందని, 23వ తేదీన పరోక్ష ఎన్నికలు జరగనున్నాయని వివరించారు. మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు వైస్ చైర్‌పర్సన్ ఎన్నికలు, మున్సిపల్ కార్పొరేషన్లలో డిప్యూటీ మేయర్ ఎన్నికలు పరోక్ష పద్ధతిలో జరగనున్నాయి. ఆయా స్థానిక సంస్థలకు ఎన్నికైన వార్డు సభ్యులు, చైర్ పర్సన్‌లు, మేయర్ లు ఎన్నికైన ఒక వార్డు సభ్యున్ని డిప్యూటీ మేయర్ గా, వైస్ చైర్‌పర్సన్ గా ఎన్నుకోనున్నారని తెలిపారు. కాగా.. నిర్ణీత తేదీలోగా ఎన్నికల నోటీసు జారీ చేసి, ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని సంబంధిత అధికారులకు కమిషనర్ సూచించారు.

==========

తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా రాష్ట్ర వ్యవసాయ రంగానికి జరిగిన నష్టాన్ని ఎదుర్కొనేలా కేంద్ర ప్రభుత్వం సహాయం అందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్ర బృందానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితుల అంచనా కోసం పర్యటించిన ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్ టీం (ఐఎంసీటీ) సభ్యులు ముఖ్యమంత్రితో ఈరోజు సమావేశమయ్యారు. ఈ నెల 2, 3వ తేదీల్లో రెండు బృందాలుగా కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో పర్యటించిన సభ్యులు తమ కరువు అధ్యయన వివరాలు ముఖ్యమంత్రికి తెలిపారు. రాష్ట్రంలోని తీర ప్రాంతం తుఫాన్ల సమస్యతో ఇబ్బందులు పడుతుంటే... మరోవైపు తీవ్ర వర్షాభావ పరిస్థితులు, ఎల్ నినో కారణంగా రాయలసీమ సహా మరికొన్ని ప్రాంతాలు తీవ్ర కరువుతో సతమతమౌతున్నాయని ముఖ్యమంత్రి ఆ బృందానికి వివరించారు. రాష్ట్రంలోని 21 జిల్లాల్లో 388 మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా ప్రకటించామని, రైతులకు జరిగిన నష్టాన్ని అంచనా వేసి.. కేంద్ర సహాయం కోరుతూ ఇప్పటికే మెమొరాండం సమర్పించామని ముఖ్యమంత్రి బృందానికి వివరించారు.

==========

జిల్లాలో రేపు నిర్వహించనున్న పరిషత్ ఎన్నికలను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో, పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని విశాఖ జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. పెందుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరిషత్ ఎన్నికల మెటీరియల్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని, స్ట్రాంగ్ రూమ్‌ను, ఓట్ల లెక్కింపు హాలును కలెక్టర్ ఈరోజు పరిశీలించి.. ఎన్నికల సిబ్బందికి అందిస్తున్న సామగ్రి, రికార్డులు, ఇతర ఏర్పాట్లపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులు, ఎన్నికలకు సంబంధించిన ఇతర ముఖ్యమైన సామగ్రిని నిర్దేశించిన నిబంధనల ప్రకారం భద్రపరిచేందుకు స్ట్రాంగ్ రూమ్‌లలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. స్ట్రాంగ్ రూమ్‌ల భద్రత, పర్యవేక్షణ విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ఎన్నికల సామగ్రి భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.

విరామం

==========

ఎగ్జామినేషన్ రిఫార్మ్స్ హై పవర్డ్ టాస్క్ ఫోర్స్ చైర్మన్ నందన్ నీలేకని ఈరోజు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో రాష్ట్ర సచివాలయంలో సమావేశమయ్యారు. దేశ పరీక్షల విధానాన్ని సమూలంగా మార్చటంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం నందన్ నీలేకని నేతృత్వంలో కమిటీ ఏర్పాటు చేసింది. పరీక్షల విధానంలో తీసుకురావాల్సిన సంస్కరణలపై వివిధ రాష్ట్రాల్లో టాస్క్‌ఫోర్స్ బృందం పర్యటిస్తుంది. ఈ సందర్భంగా నందన్ నీలేకని.. రాష్ట్రంలో అనుసరిస్తున్న అకడమిక్, కాంపిటేటివ్ పరీక్షల నిర్వహణ విధానాలను ముఖ్యమంత్రిని అడిగి తెలుసుకున్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంచేలా మొత్తం విద్యా విధానంలో సంస్కరణలు తీసుకురావాలని చంద్రబాబు నాయుడు టాస్క్‌ఫోర్స్‌కు సూచించారు.

==========

విశాఖపట్నం ఉక్కు కర్మాగారాన్ని నిర్వహించే రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్ఐఎన్ఎల్) భూముల రెండో దశ ఈ-వేలం విజయవంతంగా పూర్తయింది. భారత ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని ప్రభుత్వ రంగ సంస్థల విభాగం పరిధిలో కార్యకలాపాలు నిర్వహించే నేషనల్ ల్యాండ్ మానిటైజేషన్ కార్పొరేషన్ (ఎన్ఎల్ఎంసీ) ఈ-వేలాన్ని నిర్వహించింది. వినియోగంలో లేని అదనపు ప్రభుత్వ ఆస్తుల నుంచి ఆదాయాన్ని సమకూర్చుకోవడాన్ని సులభతరం చేసేలా ఎన్ఎల్ఎంసీ చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా ఈ-వేలం నిర్వహించింది. రెండు దశల వేలంలోను కలిపి మొత్తం 584.33 కోట్ల రూపాయల బిడ్ విలువ సమకూరిందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

==========

రేపు జరగనున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. భీమవరంలోని ఎస్ఆర్కేఆర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రం, ఓట్ల లెక్కింపు కేంద్రాలను ఆమె ఈరోజు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 20 జడ్పీటీసీ స్థానాలకు, 340 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఎన్నికల విధుల నిర్వహణ కోసం సుమారు 7 వేల 500 మంది అధికారులు, సిబ్బందిని నియమించినట్లు చెప్పారు. పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీసీ కెమెరాలు, వీడియో కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ చేపడుతున్నామని కలెక్టర్ వెల్లడించారు.

==========

తూర్పుగోదావరి జిల్లాలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను రేపు యథావిధిగా నిర్వహించనున్నామని కలెక్టర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. మురాసు తుఫాను కారణంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు వాయిదా పడ్డాయంటూ పలు సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవమని చెప్పారు. ప్రజలు ఇటువంటి వదంతులను నమ్మవద్దని, వాటిని ఇతరులకు వ్యాప్తి చేయవద్దని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో మొత్తం 1,476 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

==========

తూర్పు తెలంగాణ, కోస్తా ఆంధ్రప్రదేశ్‌పై ఏర్పడిన మురాసు తుఫాను బలహీనపడి వాయుగుండంగా మారిందని భారత వాతావరణ విభాగం (ఐఎండి) తెలియజేసింది. ఈ వాయుగుండం ఉత్తరం వైపు కదులుతూ.. మరింత బలహీనపడి అల్పపీడన ప్రాంతంగా మారే అవకాశం ఉందని ఐఎండి పేర్కొంది. రానున్న మూడు రోజుల పాటు కేరళం, మాహే, తమిళనాడు, పుదుచ్చేరి, కారైకల్, తెలంగాణలోని కొన్ని ప్రాంతాలలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ శాస్త్రవేత్త పేర్కొంటూ...

(వాయిస్ 25 సెకన్లు)

==========

అల్లూరి సీతారామరాజు జిల్లా సాధారణ ఎన్నికల పరిశీలకులు రోణంకి కూర్మనాథ్ ఈరోజు పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను సందర్శించారు. ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాలను క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి, ఎన్నికల ఏర్పాట్లు, పోలింగ్ సిబ్బందికి విధుల కేటాయింపు, ఎన్నికల సామగ్రి పంపిణీ, పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది తరలింపు తదితర అంశాలను పరిశీలించారు.

==========
==========